సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం | 1 | జూన్ | 2025




అలా స్పాగిపోతున్నారు..!
సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నయా సంస్కృతి మొదలైంది. ఎక్కడో హైదరాబాద్, బెంగళూరు వంటి కాస్మోపాలిటిన్ నగరాల్లో ఉండే స్పా సెంటర్ల కల్చర్ ఇక్కడకు విస్తరించింది.

8లో



యోరక్కపోయారుగా..
రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యోగాంధ్ర హంగామా ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. ఇందులో పెద్ద సంఖ్యలో ప్రజలను భాగస్వాముల్ని చేసేందుకు వారు ఆపసోపాలు పడుతున్నారు.

కడలిలోకి 10,678 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 10,678 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

మార్టేరులో నూతన వరి వంగడాలు



డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు

రాజానగరం: బీపీటీ-5204 సన్న వరి వంగడానికి ప్రత్యామ్నాయంగా మార్టేరు శాస్త్రవేత్తలు ఎంటీయూ-1224, ఎంటీయూ-1262 వరి వంగడాలను తయారు చేశారని దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. ఎంటీయూ-1224 రకం 140 రోజులు, ఎంటీయూ-1262 రకం 150 రోజుల్లో కోతకు వస్తాయన్నారు. ఆసక్తి ఉన్న రైతులు మార్టేరు ఈ విత్తనాలను మార్టేరు నుంచి పొందవచ్చని, పూర్తి వివరాలకు 99896 23805 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

మహా కాళేశ్వరాలయంలో ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం



స్వామివారిని దర్శించుకుంటున్న ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం సావో

ఆల్మాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేటలోని మహా కాళేశ్వరాలయాన్ని ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి అరుణ్ సావో శనివారం దర్శించుకున్నారు. ఆయనకు రోటరీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పట్టపగలు వెంకట్రావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మహాకాళేశ్వర స్వామిని, ఉపాలయాలను సావో దర్శించారు. ఆలయ విశిష్టత, నిర్మాణం తదితర విషయాలను వెంకట్రావు వివరించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.10 లక్షల విరాళం


రెండు కిలోల వెండి సమర్పణ



రూ.10 లక్షల విరాళం అందిస్తున్న దాతలు

దేవరపల్లి: పల్లంట్ల గ్రామంలో రాజరాజేశ్వరి సమేత దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన కొయ్యలమూడి హనుమంతరావు భార్య మంగాదేవి రూ.10 లక్షల విరాళం, 2 కిలోల వెండి సమర్పించారు. వీటిని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి కొయ్యలమూడి చినబాబు, సుధారాణి దంపతులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ, దాతలు సమర్పించిన రెండు కిలోల వెండిని అమ్మవారికి మకర తోరణానికి ఉపయోగిస్తామని, రూ.10 లక్షల విరాళాన్ని ఆలయం పేరిట బ్యాంకులో డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని స్వామి, అమ్మవార్ల ధూపదీప నైవేద్యాలకు వినియోగిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈదుపుగంటి శివరాం ప్రసాద్, కొయ్యలమూడి సురేంద్రనాథ్ చటర్జీ, మొక్కపాటి శ్రీనివాసరావు, కొయ్యలమూడి అప్పారావు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మిథ్య



- కూటమి పాలనలో అస్తవ్యస్తంగా విద్యా వ్యవస్థ
- అందని 'తల్లికి వందనం'
- నత్తకు మేనత్తలా 'నాడు-నేడు'
- డిజిటల్ విద్యకు మంగళం
- రుచి లేని మధ్యాహ్న భోజనం

సాక్షి, రాజమహేంద్రవరం: విద్యా రంగంలో మునుపెన్నడూ చూడని విప్లవాత్మక మార్పులకు గత ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారు. డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు విద్యార్థులకు ఏటా ట్యాబ్‌లు అందజేశారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీల ద్వారా విద్యా బోధనను కొత్త పుంతలు తొక్కించారు. అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెనలతో పేదల ఉన్నత విద్యకు బాటలు వేశారు. గోరుముద్దతో రుచికరమైన పౌష్టికాహారం అందించారు. ఈ వినూత్న సంస్కరణలన్నీ గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరోగమనంలో పయనిస్తున్నాయి.

తల్లికి వందనం అందేనా?

ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్క పేద విద్యార్థీ చదువుకోలేని పరిస్థితి ఏర్పడకూడదనే సమున్నత లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పథకం అమలు చేసింది. విద్యార్థుల తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసింది. ఈ విధంగా నాలుగేళ్లలో జిల్లా వ్యాప్తంగా 1,55,769 మంది విద్యార్థులకు రూ.233.65 కోట్లు అందించింది. ఈ పరిస్థితుల్లో తాము అధికారంలోకి వస్తే కుటుంబంలోని పిల్లలందరికీ తల్లికి వందనం పేరిట ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కూటమి పెద్దలు గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. గద్దెనెక్కి ఏడాదవుతున్నా.. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు.

నాడు దీవెన.. నేడు నిర్వేదన

ఉన్నత చదువులకు బాసటగా నిలవాలన్న తలంపుతో గత ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, కాపు వర్గాలకు చెందిన 34,764 మంది పేద విద్యార్థులకు ఏటా రూ.32.74 కోట్ల చొప్పున అందజేసింది. దీనివలన ఫీజులు చెల్లించుకోలేని ఎంతో మంది విద్యార్థులు లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం దీనిని పట్టించుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం పడింది.

వసతి దీవెన

జగనన్న వసతి దీవెన పథకం కింద జగన్ ప్రభుత్వం 34,261 మంది విద్యార్థులకు చెందిన 30,559 మంది తల్లుల ఖాతాలో ఏటా రూ.32.61 కోట్లు జమ చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పథకాన్నే పట్టించుకోవడం లేదు.

డిజి'దల్' బోధన

విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభతరం చేసేందుకు గత ప్రభుత్వం క్రమం తప్పకుండా బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్ అందజేసింది. 2022-23 విద్యా సంవత్సరంలో 15,291 మంది విద్యార్థులకు, 2,445 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందించారు. 2023-24లో 15,332 మంది 8వ తరగతి విద్యార్థులకు 5,510 ట్యాబ్‌లు అందజేశారు. ఈ ట్యాబ్‌లలో ఈ-పాఠశాల యాప్ అప్‌లోడ్ చేశారు. 3వ తరగతి నుంచి ఇంటర్ వరకూ పాఠాలను అప్‌లోడ్ చేశారు. ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, ఐబీ, టోఫెల్ విధానాలను ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వీటన్నింటికీ మంగళం పాడింది.

జిల్లాలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అందించిన లబ్ధి (రూ.కోట్లలో)

పథకం	లబ్ధిదారులు	లబ్ధి
విద్యా దీవెన	70,241	142.99
వసతి దీవెన	69,098	65.56
అమ్మ ఒడి	1,56,000	234
జగనన్న విదేశీ విద్య	12	1.37
జగనన్న గోరుముద్ద	84,488	12.32
జగనన్న విద్యా కానుక	1,22,000	28.8
నాడు-నేడు పనులు	1069	369.89

మందగించిన 'నాడు-నేడు'

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం 'నాడు-నేడు' పథకం తీసుకువచ్చింది. జిల్లాలో తొలి విడతతో 414 పాఠశాలల్లో 1,006 పనులకు రూ.129.70 కోట్లు ఖర్చు చేశారు. రెండో దశలో రూ.271 కోట్లు వెచ్చించి 665 పాఠశాలల్లో 996 అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, బాల బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, కుర్చీలు, బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఆర్వో ప్లాంట్లు తదితర వసతులు కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో వేగంగా జరిగిన ఈ పనులు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నత్తకు మేనత్తలా మారాయి. ఎక్కడికక్కడ పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.



నల్లజర్ల మండలం అనంతపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నత్తనడకన సాగుతున్న 'నాడు-నేడు' తరగతి గదుల నిర్మాణం

రుచీపచీ లేని భోజనం

గత ప్రభుత్వం జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించేది. గుడ్లు, చిక్కీలతో పాటు రోజుకో మెనూతో బలవర్ధకమైన భోజనం వడ్డించేవారు. జిల్లావ్యాప్తంగా 1,011 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. దాదాపు 1.26 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. జగనన్న గోరుముద్ద పథకానికి గత ప్రభుత్వం రూ.11.64 కోట్లు వెచ్చించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలం చెల్లిన గుడ్లు, చిక్కీలు అందజేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందని ద్రాక్షలా మారింది.



చాగల్లు మండలం ఊనగట్ల ఉన్నత పాఠశాలలో స్మార్ట్ టీవీతో బోధన (ఫైల్)

నాటి 'స్మార్ట్' ఏదీ?

విద్యా బోధనలో గత ప్రభుత్వం స్మార్ట్‌కు నాంది పలికింది. జిల్లాలోని 297 పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన అమలు చేశారు. దీనికి గాను 1,099 స్మార్ట్ టీవీలు, 386 ఐఎఫ్‌పీలు అమర్చారు. వీటి ద్వారా పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు సులభంగా బోధించేవారు. కూటమి ప్రభుత్వ హయాంలో డిజిటల్ బోధన సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది.

విద్యా కానుక

గత ప్రభుత్వం జగనన్న విద్యా కానుక పేరిట ఏటా స్కూల్ బ్యాగ్, యూనిఫాం, బెల్ట్, షూ, పాఠ్య, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, డిక్షనరీ కలిపి ప్రత్యేక కిట్‌గా అందజేసేది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1.765 లక్షల మంది విద్యార్థులకు రూ.30.50 కోట్ల విలువైన వస్తువులు అందించారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

గత ప్రభుత్వ హయాంలో..

- గత ప్రభుత్వ చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి. ఉదాహరణకు రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ జెడ్పీ హైస్కూలులో అన్ని తరగతులూ కలిపి సాధారణంగా వెయ్యి మంది విద్యార్థులకు పరిమితి ఉంది. ఈ పాఠశాలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దడం, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడంతో ప్రవేశాల సంఖ్య 1,375కు పెరిగింది.
- జిల్లావ్యాప్తంగా కొన్నేళ్లుగా నిరాదరణకు గురైన 15 జూనియర్ కళాశాలల అభివృద్ధికి బాటలు వేశారు. రూ.10.79 కోట్లతో కళాశాలల ఆధునీకరణ పనులు చేపట్టారు.
- పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యలోనూ రిజర్వేషన్లు అమలు చేసింది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో 10 శాతం ఎస్సీలకు, 5 శాతం దివ్యాంగులకు కేటాయించింది. మరో 4 శాతం ఎస్టీలకు, బలహీన వర్గాలకు 6 శాతం సీట్లు ఇవ్వాలని నాటి ప్రభుత్వం ఆదేశించింది.
- పదో తరగతి అనంతరం ఇంటర్ చదివేందుకు విద్యార్థులు పడుతున్న అవస్థలను దూరం చేసేందుకు, గ్రామానికి సమీపంలోనే ఉన్నత విద్యను అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతి మండలంలోనూ ఒకటి చొప్పున 15 బాలికల జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసింది.



అధునాతనంగా రూపుదిద్దుకున్న శాటిలైట్ సిటీ పాఠశాల

ఎండీయూ వాహనాల తొలగింపు దారుణం

- హైకోర్టును ఆశ్రయించాం
- బాధితులకు అండగా నిలబడతాం
- ఎండీయూ ఆపరేటర్ల ర్యాలీలో మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: లబ్ధిదారులకు నేరుగా ఇంటి వద్దనే రేషన్ సరకులు అందించాలనే మంచి లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్ల వ్యవస్థను అర్థాంతరంగా తొలగించడం దారుణమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండీయూ ఆపరేటర్ల జిల్లా యూనియన్ ఆధ్వర్యాన స్థానిక మెయిన్ రోడ్డులో శనివారం నిర్వహించిన నిరసన ర్యాలీకి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, నాడు జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 18,600 మంది ఎండీయూ ఆపరేటర్లకు ఉపాధి లభించిందన్నారు. ఈ వ్యవస్థ పట్ల వృద్ధులు, మహిళలు కూడా ఎంతో ఆనందంగా ఉన్నారని, సక్రమంగా పని చేస్తున్నప్పటికీ ఎండీయూ వ్యాన్లను జూన్ 1 నుంచి తొలగిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించడం దారుణమని మండిపడ్డారు. దీనివలన వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారు నిరుద్యోగులుగా మారి, రోడ్డున పడనున్నారన్నారు. అనాలోచిత నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎండీయూ ఆపరేటర్లకు న్యాయం చేయాలని భరత్ రామ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 2027 వరకూ ఎండీయూ వ్యాన్లు నిర్వహించుకునేందుకు అనుమతులున్నప్పటికీ అర్థాంతరంగా తొలగించడం దారుణమన్నారు. దీనిపై ఇప్పటికే హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశామని, న్యాయస్థానం ప్రభుత్వ వివరణ కోరిందని చెప్పారు. అయితే, ప్రభుత్వం తరఫున పెద్ద ఎత్తున లాయర్లు కోర్టుకు వచ్చి, ఇది ప్రభుత్వ విధానమని, ఖర్చు ఆదా అవుతుందని, మూడు వారాలు గడువు కావాలని కోరారని తెలిపారు. దీనిపై లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ ప్రభుత్వానికి హైకోర్టు మూడు వారాల గడువు ఇచ్చిందన్నారు. ఎండీయూ ఆపరేటర్లకు న్యాయం జరిగే వరకూ న్యాయ పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఎన్నికల ముందు ఇష్టమొచ్చినట్లు వాగ్దానాలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకపోగా ప్రతి వర్గాన్నీ దెబ్బ తీసేలా నిర్ణయాలు తీసుకుంటున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 29 వేల మంది రేషన్ డీలర్లు ఉండగా, కొత్తగా మరో ఆరు వేల మందిని తీసుకుంటున్నారని, వీటిని టీడీపీ నాయకులు, అనుయాయులకు కట్టబెట్టడానికి ఎమ్మెల్యేలు రూ.లక్షలు డిమాండ్ చేస్తూ, జేబులు నింపుకొంటున్నారని ఆరోపించారు. ఒక్కో రేషన్ డిపోకు రూ.5 లక్షలు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని భరత్‌రామ్ అన్నారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గుత్తుల మురళీధర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, పార్లమెంటరీ అధికార ప్రతినిధి కానుబోయిన సాగర్, నాయకులు మజ్జి అప్పారావు, సంకిస భవానీప్రియ, వాసంశెట్టి గంగాధరరావు, సప్ప ఆదినారాయణ, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మార్గాని భరత్‌రామ్, షర్మిలారెడ్డి

4న వెన్నుపోటు దినం

- కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దాం
- వైఫల్యాలను ఎండగడదాం
- ప్రజలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు పిలుపు

రాజమహేంద్రవరం రూరల్: ఏడాది పాలనలో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిన తీరును ఎండగడుతూ.. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4న నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. వెన్నుపోటు దినం కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆధ్వర్యాన మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఒక్క రోజు కూడా ప్రజల గురించి ఆలోచించకుండా దుర్మార్గ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ వంచనను ప్రశ్నిస్తూ తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసనలతో ఆయన కళ్లు తెరిపిస్తామన్నారు. ఏడాదిలోనే 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని చెప్పారు. దీనికి భిన్నంగా చంద్రబాబు ఏడాదిలోనే అరాచక పాలన చూపించారన్నారు. పైగా ఎన్నికల హామీల గురించి ప్రశ్నించకుండా భయోత్పాతం సృష్టించడాన్ని ఎప్పుడూ ఎవరూ చూసి ఉండరని అన్నారు. సంపద సృష్టిస్తానని, పేదల బతుకుల్లో వెలుగులు తెస్తానని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు పీ4 అంటూ పేదరికాన్ని నిర్మూలించే బాధ్యత నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎంగా తొలి ఏడాదిలోనే చంద్రబాబు రూ.1.49 లక్షల కోట్ల అప్పు చేశారని, ఆ సొమ్మంతా దేనికి వినియోగించారో తెలియదని అన్నారు. నాడు మామకు, నేడు నేరుగా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. వెన్నుపోటు దినం సందర్భంగా నియోజకవర్గ స్థాయిల్లో పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లి, అధికారులకు విజ్ఞాపనలు సమర్పిస్తామని చెప్పారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని, ఏడాది కాలంగా ప్రజలకిస్తామన్న అన్ని పథకాల లబ్ధినీ తక్షణం విడుదల చేయాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు, కూటమి ప్రభుత్వంలో మోసపోయిన రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని, ప్రభుత్వాన్ని నిలదీసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేణు పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ, ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేకపోయినా రూ.1.49 లక్షల కోట్లు అప్పులు మాత్రం చంద్రబాబు చేశారని విమర్శించారు. వలంటీర్లతో సహా పలువురి ఉద్యోగాలు ఊడబీకారని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల వైద్య విద్య కలను సాకారం చేసేందుకు గత ముఖ్యమంత్రి జగన్ మెడికల్ కళాశాలలు నిర్మిస్తే, ఇప్పుడు వాటిని కూడా బడాబాబులకు ధారాదత్తం చేసేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ, 2014లో డ్వాక్రా మహిళలను చంద్రబాబు వంచించారని, ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా మళ్లీ మోసం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేదని, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ వివిధ విభాగాల నాయకులు గిరజాల వీర్రాజు (బాబు), పరిమి సోమరాజు, పిట్టా శ్రీనివాస్, కంతమణి రమేష్, ఇంటి వీర్రాజు, మార్తి లక్ష్మి, పెయ్యల రాజేష్, బొప్పన సుబ్బారావు, యెనుముల త్యాగరాజు, చిట్టూరి అన్నవరం, కొలిశెట్టి నాగేశ్వరరావు, చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామి, నియోజకవర్గ నాయకులు అంగాడి సత్యప్రియ, కానుబోయిన సాగర్, గుత్తుల మురళీధర్, చీరా రాజు, దేవులపల్లి సరితారాణి తదితరులు పాల్గొన్నారు



వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మార్గాని భరత్‌రామ్, తలారి వెంకటరావు, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు

టెన్త్ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. టెన్త్ పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. రికార్డుల పిచ్చితో వారంలో పేపర్లు దిద్దేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఒత్తిడి తీసుకుని రావడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. పేపర్ల మూల్యాంకనంపై సందేహంతో 66,363 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే 11 వేల మందికి పైగా విద్యార్థుల ఉత్తీర్ణతతో పాటు మార్కుల్లో మార్పులు వచ్చాయన్నారు. మూల్యాంకనంలో టీచర్లకు టార్గెట్లు పెట్టి వేధించి, విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుకుందన్నారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మంత్రి లోకేష్ టీచర్లను దోషులుగా చూపించి సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్నారని అన్నారు. పదో తరగతి మూల్యాంకనం తప్పిదాలపై లోకేష్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని వేణు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

రైతు ప్రాణం తీసిన కలుపు మందు


చెల్లు లీలాకృష్ణ ప్రసాద్ (ఫైల్)

నల్లజర్ల: పంట పొలాల్లో కలుపు నివారణకు వినియోగించే గడ్డి మందు ఓ యువ రైతు ప్రాణం తీసింది. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన యువ రైతు చెల్లు లీలాకృష్ణ ప్రసాద్ (30) పదిహేను రోజుల కిందట పొలాల్లో కలుపు నివారణకు ఇంటి వద్ద ఉన్న గడ్డి మందు డబ్బాను పొలానికి తీసుకెళ్లాడు. ఆ డబ్బాను బైక్ ముందు కవర్‌లో పెట్టాడు. మార్గ మధ్యంలో డబ్బా మూత లీకై అతని ప్యాంట్‌పై పడింది. ఏమీకాదులే అని కడిగేసుకుని ఆ మందు స్ప్రే చేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఒక్కరోజు వ్యవధిలోనే ఒంటిపై పడిన మందు ద్రావణం వృషణాల నుంచి శరీరంలోని కిడ్నీ, లివర్ తదితర అవయవాలకు సోకింది. అతను తొలుత ఏలూరు, తర్వాత విజయవాడ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు మృతుడి తండ్రి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏడాది క్రితమే ప్రసాద్‌కు ఆవపాడుకు చెందిన మౌనికతో వివాహం కాగా, ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. ప్రసాద్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

అటవీ భూమిలో చెట్ల నరికివేత


కోమటికుంట అటవీ భూమిలో పట్టుకున్న ట్రాక్టర్

గోపాలపురం: మండలంలోని కోమటికుంట అటవీ భూమిలో ఉన్న చెట్లు నరికివేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రెండు ట్రాక్టర్ల పుల్లలను స్వాధీనం చేసుకున్నామని డీఆర్‌ఓ కె.వేణుగోపాల్ శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అటవీ శాఖకు చెందిన భూమిలో ఉన్న వేప, జీడిమామిడి చెట్లు అక్రమార్కులు నరుకుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. అక్కడ రెండు ట్రాక్టర్లతో ఉన్న సుమారు 12 టన్నుల పుల్లలను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు డీఆర్‌ఓ తెలిపారు.

అలా స్పాగిపోతున్నారు..!

- మసాజ్ పేరుతో మగువలతో వల
- రాజమహేంద్రవరంలో స్పా సెంటర్లు
- గుట్టుచప్పుడు కాకుండా హైటెక్ వ్యభిచారం
- దృష్టి సారించిన పోలీసు యంత్రాంగం


రాజమహేంద్రవరంలో పోలీసులు దాడి చేసిన స్పా సెంటర్



ఓ సెంటర్‌లో ఆధునిక వసతులతో కూడిన గది

కంబాలచెరువు: (రాజమహేంద్రవరం): సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నయా సంస్కృతి మొదలైంది. ఎక్కడో హైదరాబాద్, బెంగళూరు వంటి కాస్మోపాలిటన్ నగరాల్లో ఉండే స్పా సెంటర్ల కల్చర్ ఇక్కడకు విస్తరించింది. మసాజ్ పేరుతో హైటెక్ వ్యభిచారం అధికమైంది. ఉపాధి పేరుతో ఆయా స్పా సెంటర్లలో చేరిన యువతులను నిర్వాహకులు పడుపు వృత్తిలోకి దింపుతున్నారు. ఏడాది కాలంలో నగరంలో వ్యభిచారం నిర్వహిస్తున్న సుమారు 14 స్పా సెంటర్లపై పోలీసులు దాడులు చేసి పట్టుకోవడం చూస్తే.. జిల్లాలో చాపకింద నీరులా విష సంస్కృతి పెరిగిందని చెప్పకనే అర్థమవుతోంది.

ఎక్కడే ఎందుకంటే..

రాజమహేంద్రవరంలో ధనిక వర్గాలు ఎక్కువగా ఉండే ఏవీ అప్పారావు రోడ్డు, జేఎన్ రోడ్డు, దానవాయిపేట వంటి ప్రాంతాల్లో ఇటీవల స్పా సెంటర్లు పెరుగుతున్నాయి. నిరుద్యోగ యువత ఉపాధి వేటలో భాగంగా బ్యూటీ కోర్సులు, మసాజ్ కోర్సులు వంటివి చేసి స్పా సెంటర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యాపారం బాగుంటుండటంతో అసాంఘిక శక్తులు ఈ రంగంలోకి ప్రవేశించి పెట్టుబడి పెడుతూ తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బులు సంపాదించేందుకు పథక రచన చేస్తున్నారు. బ్యూటీపార్లర్లతో కూడిన మసాజ్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడికి వచ్చే కస్టమర్లను వ్యభిచారం వైపు లాగుతున్నారు. ఆయా సెంటర్లకు వెళ్లే విటులలో ఎక్కువ వ్యాపార వర్గాలు, యువత ఉంటున్నారు. కొద్దినెలల కిందట ఏవీ అప్పారావు రోడ్డులో పట్టుబడిన స్పా సెంటర్ నిర్వాహకురాలు బ్యూటీ పార్లర్లకు వచ్చే మహిళలకు వారి అభిరుచి మేరకు మగ వ్యభిచారులను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ఓ వాయిస్ రికార్డింగు బయటపడటం చూస్తే పరిస్థితి చేయిదాటిందని అర్థమవుతోంది. ఎక్కడో మెట్రోపాలిటన్ సిటీల్లో బయటపడే ఇటువంటి ఘటనలు జిల్లాలో విస్తరించడం చూస్తే అసాంఘిక శక్తులు ఏ మేరకు చొచ్చుకు వస్తున్నాయో స్పష్టమవుతోంది.

ఉద్యోగం పేరుతో..

బ్యూటీపార్లర్, సెలూన్, స్పా సెంటర్ల ముసుగులో వ్యభిచారాలు ప్రారంభించే నిర్వాహకులు ముందుగా బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి మసాజ్ సెంటర్లలో అనుభవం ఉన్న ఒకరిద్దరు యువతులను ఆకర్షణీయమైన ప్యాకేజీతో నియమించుకుంటారు. జన సంచారం తక్కువగా ఉండే ధనిక వర్గాలు నివసించే ప్రాంతాల్లో అట్టహాసంగా స్పా, సెలూన్ సెంటర్లు ప్రారంభించి రిసెప్షన్, హెల్పర్ల పేరుతో అందమైన యువతులను పనిలో పెట్టుకుంటారు. ముందే అనుభవం ఉన్న యువతులు కొత్తగా చేరిన వారితో సన్నిహితంగా ఉంటారు. వారికి ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తూ తమవైపు తిప్పుకుంటారు. వారి అవసరాలకు డబ్బులు ఇస్తూ పూర్తిగా వీరి ఉచ్చులో పడే విధంగా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటారు. కొత్తగా చేరిన యువతులకు పాత యువతులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తూ వారిని కూడా మసాజ్ ప్రక్రియకు ఉపయోగించుకుని కమీషన్ ఇస్తారు. నిర్వాహకులు ఆ యువతులతో చనువుగా ఉంటూ ఫొటోలు దిగడం చేస్తుంటారు. అవి నిర్వాహకుల వద్ద ఉండటంతో ఆ యువతులు పూర్తిగా విధేయతతో ఉంటారు. వారితో గొడవ పెట్టుకునేందుకు సాహసించరు. ఇలా గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం సాగిపోతోంది.

హెయిర్ కటింగ్‌తో ప్రారంభమై..

ముందుగా హెయిర్ కటింగ్‌తో కస్టమర్లను ఆకర్షించే నిర్వాహకులు కస్టమర్లు అడగకపోయినా హెడ్ మసాజ్ వంటివి చేస్తారు. వారు చూపిస్తున్న ఆసక్తిని బట్టి తమ వద్ద బాడీ మసాజ్ కూడా ఉందని చెబుతారు. అలా ముగ్గులోకి వచ్చిన కస్టమర్లతో మసాజ్ ప్రక్రియలో భాగంగా పరిచయం పెంచుకుంటారు. చీకటి మాటున జరిగే ఈ మసాజ్ ప్రక్రియలో ఫుల్ మసాజ్, బాడీ టూ బాడీ మసాజ్ వంటి పేర్లతో యువతులతో మగ కస్టమర్లను ఆకర్షిస్తారు. ఇలా ప్రత్యేక గదిలో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం కూడా జరిగిపోతుంది. అలవాటు పడిన కస్టమర్లు వారానికి ఒకసారైనా ఇక్కడకు వస్తున్నారని అంటున్నారు. ఇటీవల ఓ మసాజ్ సెంటర్ నిర్వాహకురాలి ఫోన్‌లో బ్యూటీపార్లర్‌కు వచ్చే ఆడవారికి మగ వ్యభిచారులను కూడా సమకూరుస్తున్నట్టు రికార్డింగ్ బయటపడటం విష సంస్కృతికి అద్దంపడుతోంది.

ఏడాదిలో 14 సెంటర్లపై దాడి



"ఏడాది కాలంలో జిల్లాలోని రాజమహేంద్రవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో మసాజ్ సెంటర్లు, సెలూన్లు, బ్యూటీ పార్లర్లలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న 14 సెంటర్లపై పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. అక్కడ దొరికే యువతులను సాక్షులుగా పరిగణిస్తూ విటులపై, నిర్వాహకులపై కేసులు నమోదు చేశాం. స్పాలు, బ్యూటీపార్లర్లపై నిరంతరం నిఘా పెడుతున్నాం. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా సమాచారం ఇవ్వాలి."

–డి.నరసింహకిశోర్, ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

ఇసుక తవ్వకాలపై ఎన్‌జీటీకి సమాచారం


సూరెడ్డి శివకుమార్, మాజీ సైనికుడు

సీతానగరం: మండలంలోని సింగవరం ర్యాంపు వద్ద ఇసుక అక్రమ తవ్వకాలపై చెన్నై, ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ (ఎన్‌జీటీ)కు మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చానని వంగలపూడికి చెందిన మాజీ సైనికుడు, న్యాయ వాది సూరెడ్డి శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం అర్ధరాత్రి వంగలపూడి ర్యాంపు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను అడ్డుకుని, వాటిని వీడియోలు, ఫొటోలు తీసి జిల్లా కలెక్టర్, ఏడీ మైన్స్, తహసీల్దార్, ఎస్సైలకు సామాజిక మాధ్యమాల ద్వారా తెలియపర్చానని తెలిపారు. దీంతో ఎస్సై స్పందించి లారీలను నిలిపివేశారని అన్నారు. శనివారం ఉదయం మైన్స్ ఏడీ నుంచి లిఖితపూర్వక మెసేజ్ ఇచ్చారని, అందులో జిల్లా కలెక్టర్‌కు గాని, తనకు గాని సంబంధం లేదని తెలిపారన్నారు. అనకాపల్లి కలెక్టర్, మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు మాత్రమే సంబంధం ఉందని తెలియపర్చారని వివరించారు. జిల్లాలో తవ్వకాలపై వారికి సంబంధం లేదని అనడం హాస్యాస్పదంగా ఉందని, ఎన్జీటీకి తెలిపర్చిన తరువాత తనకు సమాచారం అందించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. సింగవరం లంక భూముల్లో తవ్వకాలు జరపాల్సి ఉండగా, వంగలపూడి లంక భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి, సింగవరం ర్యాంపు నుంచి కాకుండా వంగలపూడి ర్యాంపు నుంచి ఇసుక లారీలపై తరలిస్తున్నారని అన్నారు. సోమవారం గ్రామస్తులంతా లారీలను అడ్డుకుంటారని, అనకాపల్లి కలెక్టర్, ఏడీ మైన్స్ వారు వచ్చి పూర్తి వివరాలు తెలియజేసే వరకూ ఆ లారీలను అడ్డుకుంటామని శివకుమార్ హెచ్చరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
(రెవెన్యూ సెక్షన్, తిరుపతి)
Roc. No.REV-1-TTD- 47022(32)/53/ 2025, Dt: 29.05.2025
తూర్పు గోదావరి జిల్లా, కొవ్వూరు మండలము, వాడపల్లి గ్రామము నందలి తిరుమల తిరుపతి దేవస్థానముల వ్యవసాయ భూమి విస్తీర్ణము ఎ.1.00 సెంట్లు ... సంవత్సరములకు జూన్-2025 నుండి మే-2028 వరకు ... టెండర్ సహిత వేలం తేది: 10.06.2025 ... 11.30 ... వెబ్‌సైట్ https://www.tirumala.org ... 0877-2264246 ...
Roc No:TTD-40021/10/2025-PRO SEC(Adv No.60) Dt: 31.05.2025

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000

యోరక్కపోయారుగా..

- ఉద్యోగులకు యోగాంధ్ర పాట్లు
- జన సమీకరణకు ఆపసోపాలు
- వేలల్లో రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిళ్లు
- సచివాలయ సిబ్బందికి టార్గెట్లు


యోగా చేయిస్తున్న శిక్షకుడు

కాకినాడ సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న హంగామా అధికారులకు తలనొప్పి తెచ్చిపెడుతోంది.. జూన్ 21వ తేదీకి అందరికీ యోగాపై సంపూర్ణ అవగాహన ఉండాలంటూ నెల రోజుల కార్యక్రమాలకు పిలుపునిచ్చింది.. ఈ సందర్భంగా ప్రతి రోజూ గ్రామ, పట్టణ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది. ప్రజలను భాగస్వామ్యం చేయాలని సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి తెస్తోంది. దీంతో జిల్లాలో కార్పొరేషన్, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలతో పాటు సచివాలయాల పరిధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. రహదారులపై యోగా చేయిస్తుంది. ర్యాలీలు చేపడుతుంది. మొత్తంగా జిల్లా అధికార యంత్రాంగం దాదాపు కొద్ది రోజులుగా ఇదే పనిలో ఉంటోంది. జూన్ 21వ తేదీ వరకూ ఇదే హడావుడి. మరి ఇవన్నీ చేయాలంటే మనుషులు ఉండాలి. అందుకోసం అందుబాటులో ఉన్న ఏ ఒక్కరినీ వదలడం లేదు. అంగన్‌వాడీలు, డ్వాక్రా మహిళలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, సచివాలయం సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తున్నారు. వీటిని పక్కాగా అమలు చేసేందుకు గ్రామ, మండల స్థాయి కమిటీలను నియమించారు. యోగాంధ్ర మినహా కొద్దిరోజులుగా మిగతా విషయాలను పక్కన పెట్టేశారు.

లెక్కల కోసం తిప్పలు

యోగా మాసంలో భాగంగా వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహించాలని పైనుంచి ఆదేశాలు వచ్చాయి. అంతేకాదు పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వామ్యం చేయాలని చెబుతున్నారు. దీంతో లెక్కలు చూపించేందుకు జిల్లా అధికారులు అపసోపాలు పడుతున్నారు. పెద్దఎత్తున రిజిస్ట్రేషన్ చేయాలని సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించారు. దీనికోసం యోగా మంత్ యాప్‌ను సిద్ధం చేశారు. స్వచ్ఛందంగా ప్రజలెవరూ నమోదుకు ముందుకు రాకపోవడంతో సచివాలయ సిబ్బందే తమకు తెలిసిన వారి నంబర్లు సేకరించి, వారికి ఓటీపీలు ఇవ్వండంటూ బతిమలాడుతూ, రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇలా ఎందుకు ఓటీపీలు అడుగుతున్నారో కూడా చాలా మందికి తెలియకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులతోనూ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో సుమారు 10 లక్షల మందిని యోగాంధ్రలో భాగస్వాములు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రతి రోజూ ఉద్యోగులను ఆయా కార్యాలయాల్లో యోగా చేసినట్లు ఫొటోలు తీసి నెట్‌లో అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలుండడంతో అధికారులు ఉద్యోగులను, ప్రజలను సమీకరించి యోగా కార్యక్రమాలు చేపట్టేందుకు వారికి తల ప్రాణం తోకకు వస్తుందని వాపోతున్నారు. గతంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఏదో కార్యక్రమం చేపట్టేవారని, ఇలా నెల రోజులు నిర్వహించి, పెద్దఎత్తున నిధులు, సమయం వృథా చేయడం ఎన్నడూ లేదని ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికారులు సైతం మరోదారి లేక ఫొటోల కోసం మమ అనిపించేస్తున్నారు.

మృతదేహం తరలించకుండా అడ్డగింపు

సీతానగరం: మండలంలోని మిర్తిపాడుకు చెందిన గద్దె ప్రభావతి (76) మృతి చెందగా ఆమె మృతదేహాన్ని తీసుకు వెళ్లకుండా గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికుల వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఉదయం మిర్తిపాడులో సచివాలయ సిబ్బంది పింఛను ఇవ్వడానికి వెళ్లగా ఇంటి తలుపులు తీయకపోవడంతో ఇంట్లోకి వెళ్లి గమనించగా బాత్‌రూమ్ వద్ద కిందపడి ప్రభావతి మృతి చెంది ఉంది. ఆమెకు నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం కుమారులు. రెండో కుమారుడు సుబ్రహ్మణ్యం కొన్నేళ్ల క్రితం మరణించగా, అతని భార్య అనంతలక్ష్మి ఉద్యోగం చేస్తున్న కుమారులతో విశాఖపట్నంలో ఉంటుంది. మరణించిన ప్రభావతి పెద్ద కుమారుడు నాగేశ్వరరావు వద్ద ఉంటుంది. ప్రభావతికి మూడెకరాలు ఉండగా, దానిని తన తల్లి వద్ద కొనుగోలు చేశానని పెద్ద కుమారుడు చెబుతున్నారు. దీంతో రెండో కుమారుడు కుటుంబానికి 1.50 ఎకరాలు ఇవ్వాలని, మరణించిన ప్రభావతి వద్ద ఉన్న 70 కాసుల బంగారం అక్కర లేదని, గ్రామస్తులు మృతదేహాన్ని ఇంటి నుంచి తీసుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై డి.రామ్‌కుమార్ అక్కడకు వెళ్లి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఆస్తి వ్యవహారం తేలకపోవడంతో మిర్తిపాడు ఇంటి వద్ద ప్రభావతి మృతదేహం అలాగే ఉంచారు.

ఆలయంలో హుండీ చోరీ

కంబాలచెరువు: దేవీచౌక్‌లోని ఉమా బసవలింగేశ్వరస్వామి ఆలయంలోని హుండీ చోరీకి గురైంది. గుడి పూజారి గండ్ల వీరమణికంఠ కుమార్ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. యథావిధిగా ఉదయం గుడికి వచ్చిన పూజారి హుండీ పగులకొట్టి ఉండడంతో వెంటనే విషయాన్ని ఆలయ కమిటీకి తెలియజేశారు. హుండీలో సుమారు రూ.45 వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు తీవ్ర గాయాలు


రాజానగరంలో ప్రమాదం జరిగిన ప్రాంతం


సత్యభాస్కరరావు (ఫైల్)

రాజానగరం: జాతీయ రహదారిపై రాజానగరం ఏడీబీ రోడ్డు జంక్షన్ వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన బిక్కన సత్యభాస్కరరావు (69), అతని భార్య పాపాయమ్మతో కలసి స్కూటీపై పెద్దాపురం మండలం కట్టమూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక ఏడీబీ రోడ్డు జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా, వీరి వెనుక నుంచి వ్యాన్ వచ్చి ఢీకొంది. దీంతో సత్యభాస్కరరావు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్యకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులకు స్టేట్ ర్యాంకులు


లిఖిత


బేగం

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కళాశాలలో ఫస్టియర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు స్టేట్ ర్యాంకులు సాధించారు. వై.లిఖిత ఫస్ట్ ర్యాంకు, ఎండీవీజే బేగం 7వ ర్యాంకును పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు తెలిపారు. వారిని యాజమాన్యం అభినందించింది.

మాల మహానాడు జేఏసీ నాయకుల అరెస్ట్

పామర్రు పోలీస్ స్టేషన్‌కు తరలింపు


ముమ్మిడివరంలో గృహ నిర్బంధంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు మునికుమారి


కాట్రేనికోనలో గృహ నిర్బంధంలో జేఏసీ నాయకులు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శనివారం వచ్చిన సీఎం చంద్రబాబుకు ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరిగిందని తెలపాలని మాల మహానాడు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాల మహానాడు జేఏసీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమలాపురం రూరల్, క్రైమ్ సీఐల ఆధ్వర్యంలో శనివారం ఉదయం బందరుపాలెం సమీపంలో కర్రివానిరేవుకు చెందిన జేఏసీ నాయకుడు కాశి జగపతిరావు, ఎదుర్లంక గ్రామానికి చెందిన దుక్కిపాటి సత్యనారాయణ, ముమ్మిడివరానికి చెందిన దేవరపల్లి ఏడుకొండలు, మెండి కృష్ణబాబు, ఉచ్చుల సాల్మన్‌రాజులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం పామర్రు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జేఏసీ నాయకులతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా నాయకురాలు కాశి బాలమునికుమారిని ముమ్మిడివరం బాలయోగి ఆశ్రమం వద్ద గృహ నిర్బంధం చేశారు.అలాగే కాట్రేనికోనకు చెందిన వడ్డి శ్యాంప్రసాద్, గల్లా రాజేందర్‌లను గృహ నిర్బంధం చేశారు. శనివారం రాత్రి ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌కు జేఏసీ నాయకులను తీసుకు వచ్చి అప్పగించారు.

పర్యాటకుల కోసం ప్రత్యేక రైళ్లు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజా

రాజమహేంద్రవరం సిటీ: ఉత్తర భారత దేశంలో ప్రముఖ దేవాలయాలను సందర్శించుకునేలా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ హాలో సంయుక్త ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పర్యాటక రైళ్లను నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ఆయన మీడియా సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 14న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా సికింద్రాబాద్ నుంచి అయోధ్య కాశీ పుణ్యక్షేత్రాలు మీదుగా వారణాసి, ప్రయోగరాజ్, రామ జన్మభూమి, త్రివేణి సంగమం నైమిశా శరణ్యం సందర్శించుకోవచ్చన్నారు. 14వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ పర్యటన ఎకానమీ, స్టాండర్డ్, కంఫర్ట్ ప్యాకేజీల్లో ఉందన్నారు. ఈ రైలుకు విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని బోర్డింగ్ సౌకర్యం ఉంటుందన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి జూలై 5న పంచ జ్యోతిర్లింగ దర్శన్ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ప్రారంభమై అదే నెల 13న యాత్ర ముగుస్తుందన్నారు. నాగపూర్, ఉజ్జయిని, నాసిక్, పూణే ఔరంగాబాద్, డాక్టర్ అంబేడ్కర్ జన్మస్థలం మహా పుణ్యస్థలాల సందర్శన ఉంటుందన్నారు. ఈ రైలుకు కామారెడ్డి, నిజామాబాద్, నాందేడు, పూర్ణ స్టేషన్లో బోర్డింగ్ ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి లేహ్, లడఖ్, చారుదాం, గోవాలకు విమాన ప్యాకేజీలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సమావేశంలో ఐసీటీసీ అసిస్టెంట్ మేనేజర్ బాలాజీ పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION
■ ఓపెన్ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్, డిగ్రీ, పీజీ, పైన్స్ & ఆర్ట్స్ MBA, MCA అన్ని యూనివర్సిటీల పరీక్షలు మా కాకతీయ విద్యాసంస్థలు, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్ గైడ్స్, మా ఆఫీసులు : కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్ : 82975 92043, 99494 82757 [V- 2809]

Real Estate

FLAT FOR SALE
■ RJY కవలగొయ్యిలో PJ కన్‌స్ట్రక్షన్‌లో E/F Flats మరియు బాలాజీపేట, J.N. రోడ్‌లో Flats అమ్మకానికి కలవు. ✆ : 96524 22715, 80749 76722 [R-1630]

HOUSE FOR SALE
■ రాజమండ్రి, తిలక్‌రోడ్‌లో రూపా సప్లై కంపెనీ ప్రక్కనగల G+2 కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును. ✆ : 70133 71110 [SCA25004186]

LAND FOR SALE
■ కాకినాడ, నడకుదురు వద్ద శుభం కౌంటి లే అవుట్‌కు మరియు NH-216 బైపాస్ రోడ్‌కి దగ్గరగా ఇరువైపులా 7 ఎకరాలు మరియు 2 ఎకరాలు లే అవుట్‌లకు అనువైన భూమి అమ్మకమునకు కలదు. సంప్ర॥ 92461 99099 [R-30]

■ సామర్లకోట RAK సిరామిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా ADB రోడ్ నుండి 2వ బిట్ N/F రోడ్‌తో లేఅవుట్‌లకు, గొడౌన్‌లకు అనుకూలమైన 5.21 ఎకరాలు భూమి (జగ్గమ్మ గారి పేట నందు) అమ్మకము. సంప్ర॥ 92461 99099 [R-31]

PLOT FOR SALE
■ 330 sq.yards plot with 6 feet width passage for sale in Jawahar St, Opp. CMR Jewellery Mall, Kakinada No. Brokers. 9949507969 [SCA-25004320]

■ కాకినాడ, నాగమల్లితోట జంక్షన్ వద్ద పడమర ఫేసింగ్ 100 అడుగుల మెయిన్‌రోడ్‌ని అనుకుని 930 చ॥గ॥లు మరియు 846 చ॥గ॥లు కమర్షియల్ స్థలములు అమ్మకమునకు కలవు. ✆ : 92461 99099 [R-26]

■ కాకినాడ ఈస్ట్ పాయింట్ కాలనీ నందు (సురేష్ నగర్, శశికాంత్‌నగర్‌ల నుండి VS Lakshmi College కి గల 100 అడుగుల రోడ్‌కు) తూర్పు వైపు 33 అడుగుల సి.సి.రోడ్‌ని అనుకుని నూతనంగా నిర్మించిన పార్క్ ఎదురుగా, ఆదిత్య నర్సింగ్ కాలేజికి ముందు సౌత్ ఫేసింగ్ (40x60) కొలతలతో 266.66 చ॥గ॥ల చొప్పున 5 స్థలములు, పార్క్‌కి దక్షిణ వైపు 40 అడుగుల రోడ్‌ను అనుకుని నార్త్ ఫేసింగ్ (40x78) కొలతలతో 346.66 చ॥గ॥ల చొప్పున 5 స్థలములు అమ్మకమునకు కలవు. ✆ : 92461 99099 [R-25]

Services

BUSINESS OFFER
■ ప్రైవేట్ స్కూల్స్‌లో మేము చేస్తున్న ప్రోగ్రాంల్లో పెట్టుబడి పెట్టి మంచి లాభాలను పొందండి. ఫోన్ : 93917 17772 [V- 2894]

Wanted

■ రాజమండ్రి, దానవాయిపేట ప్రదీప్ డయాబెటిస్ సెంటర్ నందు ఉదయం నుండి పనిచేయుటకు ల్యాబ్ టెక్నీషియన్స్ (M/F) కావలెను. Cont., ✆ : 94403 39455 [R-240]

■ అనుభవం గల నర్సులు మరియు కంప్యూటర్ ఆపరేటర్ (Female) గా పనిచేయుటకు కావలెను. సంప్ర॥ ప్రగతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రకాష్‌నగర్, మెయిన్‌రోడ్, రాజమండ్రి [R-239]

■ ఫంక్షన్ హాల్‌లో పనిచేయుటకు గార్డ్ నింగ్ & క్లీనింగ్ వర్కర్స్ కావలెను. దంపతులకు ప్రాధాన్యత జీతం : 15,000/-, మరియు ఉచిత వసతి, జి.మామిడాడ. Cont: ✆ : 9490998888 [R-27]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,శ్రీరాం+భోజనం.Hyd.7995365999 [HA-15907]

■ ఆన్‌లోడర్స్ పురుషులు కావలెను. 8 గం॥ డ్యూటి Age: 25-45 years, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ తప్పనిసరి. మంచిజీతం + ESI +EPF కలవు. ✆ 9100028528, 7396128206 [G-27]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం TG No.1 Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పనిబేబీకేర్‌కు M/F వర్కర్స్ కా॥భో+వసతి+జీతం 16–18 వేలు ఫోన్. 9133271122/ 9515119430 [SCA25004282]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (VJA బ్రాంచ్). శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 8247 500792, 8247500574 [B-1275552]

■ హెల్త్ కేర్‌లో పనికి టెలికాలర్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, బేబీ కేర్, ఇంటి వంటపనికి స్త్రీ/పు.లు కావలెను. జీతం 18-20K. ఫుడ్ & రూమ్ ఫ్రీ. ఫోన్. 63099 08575, 63099 08576 [M-1268509]

■ RK ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేయుటకు వంట మాస్టర్స్, టిఫిన్ మాస్టర్స్, వార్డెన్స్, స్కావెంజర్స్ (బాత్ రూమ్స్ క్లీన్ చేయుటకు) వెంటనే కావలెను. సంప్ర: కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. సెల్: 97014 73399 [G-44]

■ Male Accountant : Minimum Experience 3 years. Age Limit 45 years. The Raymond Shop, Kotagummam, Rajahmundry. Send Resume through Whatsapp only to : 97037 33355 [R-7541]

■ శ్రీదేవి ఫంక్షన్ హాల్‌నందు పనిచేయుటకు గార్డెనింగ్, సివిల్ & క్లీనింగ్ కొరకు వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, జీతం: యువకులకు 18,000/-, మధ్యవయస్కులకు 15,000/-, పెద్దవారికి 12,000/-. జి.మామిడాడ. Cont: ✆ : 94909 98888 [R-34]

■ ప్రముఖ స్టీల్ కంపెనీలో మార్కెటింగ్ విధులు నిర్వహించుటకు (Male / Female) అభ్యర్థులు కావలెను. టూవీలర్ ఉన్నవారికి ప్రాధాన్యత. సెల్ : 8121213311, 9010559955. steelbuddy144@gmail.com [SCA-25004400]

Goods

FURNITURE FOR SALE
■ రాజమండ్రి:-బేకరీ మరియు స్వీట్స్ స్టాళ్ళకు అవసరమైన సెకండ్ హేండ్ షో కేసు ఫర్నీచర్ అమ్మబడును. సంప్ర॥ 92465 50443 [R-SCA25003359]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ.: 400/-
అదనపు లైనుకు రూ.: 90/-
GST 5% Extra
రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205
కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం : 99516 02838
తుని, జగ్గంపేట, యానాం : 90109 67896
అమలాపురం, ముమ్మిడివరం : 97053 47414
పి.గన్నవరం : 97057 49718, రాజోలు : 97053 45456
మండపేట : 99516 02941
రామచంద్రపురం : సెల్ : 99516 02936
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010